ఒక్క అడుగు కబ్జా చేసినా తోలుతీస్తా : ఎమ్మెల్యే

మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : మదనపల్లెలో ఒక్క అడుగు కబ్జా చేసిన తోలు తీస్తానని ఎమ్మెల్యే షాజహాన్ బాషా అన్నారు. బుధవారం అయన తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ నియోజకవర్గంలో వైసిపి నేతలు భయానక పరిస్థితులను తీసుకురావడంతో ప్రజలే వారిని సాగనంపారని పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రణాళిక బద్ధంగా ముందుకెళతానని, పట్టణంలో గంజాయి, భూ దందాలు, అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ మూడు రోజుల్లో అరికట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు. భూ కబ్జాలకు పాల్పడితే ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. పార్టీల కతీతంగా న్యాయం కోసం వచ్చేవారికి అండగా ఉంటా నన్నారు. గతంలో ఏడు మంది వైసిపి నేతలు అరాచకాలు సృష్టించినట్లు గుర్తించామని ఇకపై అలాంటి సెటిల్మెంట్ నేతల ఆటలు సాగనివ్వమని స్పష్టం చేశారు. ముఖ్యంగా గెలిపించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు.

ట'మోత'

టమోటా ధరలు ఒక్కసారిగా ఆకాశాన్నంటుతున్నాయి. సామాన్యునికి నిత్య అవసర సరుకుగా వినియోగించే టమోటా ప్రస్తుతం పేదవాని కంచంలోకి చేరడానికి ససేమిరా అంటోంది. అందుకు పెరిగిన కూరగాయల ధరలే ఇందుకు ప్రధానంగా కనిపిస్తోంది. పంటలు దెబ్బతినడంతో పంట సాగు తగ్గి దిగుబడి తీవ్ర స్థాయిలో క్షీణించింది. ఒక్కసారిగా డిమాండ్ పెరగడంతో టమోటా ధర ఒక్కసారిగా ఏకంగా కిలో రూ.50కిపైగా చేరింది. సామాన్యుని మెనూలో టమోటా అడ్రస్ గల్లంతు అవుతున్న పరిస్థితి ప్రస్తుతం జిల్లాలో కనిపిస్తోంది.

- టమోట ధరలకు రెక్కలు
- కిలో రూ.50కి చేరిన వైనం
- తగ్గిన పంట సాగే కారణం
- రైతులకు ఊరడింపు
- ఇబ్బందుల్లో సామాన్య జనం

ప్రజాశక్తి-మదనపల్లె

పేదవాడి నుంచి పెద్దోళ్ల వరకు తీసుకునే ఆహారంలో టమోటా నిత్యావసర సరుకుగా ఉంది. ప్రధానంగా సామాన్యుడు తినే పప్పుచారు నుంచి దాదాపు అన్ని రకాల వంటల్లో దీని వినియోగం అధికంగా ఉంది. సామాన్యుని పోషకాలు అందించే కూరగాయాల్లో అత్యంత అందుబాటులో ఉన్న కూరగాయల్లో టమోటా ముందు వరుసలో నిలుస్తుందనడంలో ఎలాంటి సందేహమూ లేదు. నిత్యం అందుబాటులో ఉండే టమోటా ధర ఒక్కసారిగా పెరిగింది. పెరిగిన ఈ ధరలు ప్రస్తుతం సామాన్యున్ని రారెత్తిస్తోంది. పది రోజుల కిందట కిలో రూ.10 ఉన్న ఈ సరుకు ఒక్కకసారిగా రూ.50కిపైగా చేరడంతో వినియోగదారుల గుండెలు గుబేలుమంటున్నాయి. ఒక్కో రోజు ఒక్కో రేటు ఉంటోంది. రూ.50కి పైమాటే కానీ దిగిరావడం లేదు. ఒకింత సామాన్యులకు ఇది భారమే అయినప్పటికీ మరోవైపు పంట సాగుచేసే రైతుకు ఒకింత ఊరటనిచ్చింది.

జిల్లాలోని మదనపల్లి, గుర్రంకొండ, చిన్నమండెం, బి.కొత్తకోట, రామసముద్రం, తంబళ్లపల్లె, వాల్మీకిపురం, పెద్దతిప్పసముద్రం, కురబలకోట, తదితర మండలాల్లో ప్రధాన పంటగా సాగవుతోంది. దిగుబడి బాగా తగ్గిపోవడంతో టమోటాకు డిమాండ్ పెరిగింది. ప్రధానంగా టమోటా పంట సాగు రైతుకు ప్రస్తుతం కర్రమీద సాములా తయారైంది. దీనికి ప్రధానంగా సాగునీటితో పాటు అధిక ఉష్ణోగ్రతలే ప్రధానంగా కనిపిస్తోంది. ఈ ఏడాది ఎన్నడు లేని విధంగా ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదవుతున్నాయి. పంట అధిక ఉష్ణోగ్రతల దాటికి తట్టుకోలేకపోతోంది. భూగర్భజలాలు కూడా తీవ్ర స్థాయిలో పడిపోతుండడంతో పంటల సాగు ఇబ్బందికరంగా మారుతోంది. పంట దిగుబడి కూడా సగానికి సగం పడిపోయినట్లు తెలుస్తోంది. పంట దిగుబడి తగ్గడం కారణంగా ధర ఒక్కసారిగా ఆకాశాన్నంటింది.

రైతుకు ఊరట

రైతుల పండించే టమోటాకు ఒక్కసారిగా ధర పెరగడంతో రైతు కళ్లలో కాంతులు కనిపించాయి. ప్రధానంగా పెరిగిన ఈ ధరలు ఒకరకంగా ఓ రకంగా సామాన్యులకు భారంగా మారినప్పటికీ మరోవైపు సాగుచేసిన రైతులకు ఇది మంచి ఊరట నిచ్చిందనడంలో ఎలాంటి సందేహమూ లేదు. కాగా పంటంతా దెబ్బతిన్న తరుణంలో ఈ విదమైన ధరలు పలకడం ఒకింత రైతులను నిరాశకల్గిస్తోంది. పంట దిగుబడి బాగున్నప్పుడు ఈ ధర పలికింటే తమ కష్టాలన్నీ తీరేవని నిరాశను వ్యక్తం చేయడం గమనార్హం.

కొనలేం.. తినలేం

నిత్యావసర సరుకుగా ఉన్న టమోటా ధర ఒక్కసారిగా పెరిగింది. దీనితో రోజువారి తినే ఆహారంలో టమోటాను చేర్చుకోవడం కష్టంగా మారింది. కిలో రూ.60కి పెరగడంతో కొనలేని,తినలేని పరిస్థితి దాపురించింది. పెరిగిన ధరలను తగ్గించాలి. **- సుబ్బమ్మ, గృహిణి.**

దిగుబడి తగ్గింది

టమోటా దిగుబడి తగ్గడం వల్లనే ధరలు పెరుగుతున్నాయి. రైతులు ఎంతో లబ్ధి పొందుతున్నారు. టమోటా దిగుబడి తగ్గి ధరలు పెరిగాయి. మహారాష్ట్రలో మోటాలు దిగుబడి పెరిగి ఆ టమోటాలు హైదరాబాదు మార్కెట్‌కు వస్తున్నాయి. అక్కడి నుండి టమోటా దిగుమతి తగ్గితే ధరలు ఇంకా పెరిగే అవకాశం ఉంది. మదనపల్లి మార్కెట్ యార్డ్ నుండి మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, చండీగర్, ఆగ్రా రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి.

- అభిలాష్, మార్కెట్ యార్డ్ కార్యదర్శి, మదనపల్లె.

ఆశా కార్యకర్తను వేధించిన

ఎఎన్ఎంను సస్పెండ్ చేయాలి : సిఐటియు

చిట్టెమ్మను ఆస్పత్రిలో పరామర్శిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

పట్టణంలోని వాల్మీకి వీధిలో ఉన్న పిహెచ్‌సిలో 20 సంవత్సరాలుగా ఆశా వర్కర్‌గా చిత్తశుద్ధితో పని చేస్తున్న చిట్టెమ్మను ఎఎన్ఎం పార్వతి బాయ్ బహిరంగంగా అందరి ముందు తీవ్ర అసభ్య పదజాలంతో దూషించారని, దీంతో ఆశా వర్కర్ తీవ్ర మనస్థాపం చెంది వాస్మాయిల్ తాగి బలవన్మరణానికి పాల్పడి ఒదని వెంటనే ఎఎన్ఎంను సస్పెండ్ చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మెహరున్నీసా, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు, జిల్లా కార్యదర్శి డి.భాగ్యలక్ష్మి, ఉపాధ్యక్షులు ఎ.వి.రమణ డిమాండ్ చేశారు. బుధవారం ప్రత్యాసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆశావర్కర్‌ను వారు పరామర్శించారు. అనంతరం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు నెలలుగా ఎఎన్ఎం సమస్యను పరిష్కరించకుండా ఎఎన్ఎం అధికారిననే గర్వంతో దూషణలకు దిగారని పేర్కొన్నారు. వెంటనే ఆమెపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ధర్నా గురించి సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ కొండయ్య ఆసుపత్రికి వచ్చి ఆశావర్కర్‌ను పరామర్శించి పూర్తి వివరాలు కనుక్కొని ఎఎన్ఎంపై మీద చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి : ఎస్ఎఫ్ఐ

మాట్లాడుతున్న నరసింహ

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

విద్యారంగా సమస్యలు పరిష్కారం దిశగా నూతన ప్రభుత్వం అడుగులు వేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ సర్వేపల్లి అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నూతన ప్రభుత్వానికి స్వాగతం పలుకుతూ నూతన విద్యాసంవత్సరం ప్రారంభం కాబోతుందని ప్రభుత్వ పాఠశాల భవనాలు మధ్యలోనే ఆగిపోయాయని వాటిని పూర్తిచేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సకాలంలో పాఠ్య పుస్తకాలు ఇవ్వాలని ప్రభుత్వ సంక్షేమ హాస్టల్లో శిథిలావస్థలో ఉన్న భవనాలను మరమ్మతులు చేయించి వాటి అభివృద్ధికి నూతన ప్రభుత్వం కృషి చేయాలని చెప్పారు. గత ప్రభుత్వంలో ప్రభుత్వ సంక్షేమ హాస్టల్లో మిస్ కాస్మొటిక్ చార్జీలు నేటికీ విడుదల కాలేదని ఆ శాఖలతో సంప్రదింపులు జరిపి వెంటనే బిల్లులు కూడా విడుదల చేయాలని కోరారు. ఇంటర్మీడియట్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని రద్దు చేశారని నూతన ప్రభుత్వం పునఃప్రారంభించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు పుస్తకాలు ఇవ్వాలని కోరారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఐదు సంవత్సరాల కాలంలో నిరుద్యోగులకు ఎన్నికలలో ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చకపోగా శాంతియుత పోరాటాలు చేస్తున్న విద్యార్థి, యువజన సంఘాలు వారిపై అక్రమ కేసులు పెట్టి అరెస్టులు చేశారని మండి పడ్డారు. ఈ ఎన్నికలలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాని కాలగర్భంలో కలపడానికి రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగులు, ప్రజలు ఏకమై జగన్మోహన్ రెడ్డి ఇంటికి సాగనంపారని తెలిపారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2 లక్షల 36వేల ప్రభుత్వ శాఖలోనే పోస్టులు భర్తీ చేసి , మెగా డీఎస్సీ, ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్, 117 జీవో పేరుతో పదివేల ఉపాధ్యాయుల పోస్టులు రద్దు చేసిన జగన్మోహన్ రెడ్డి సర్కార్ తెలుగు మీడియం రద్దు చేయడం కారణంగా 15,000 మంది ఉపాధ్యాయుల పోస్టుల రద్దయా అన్నారు. విద్యా విధానంలో వ్యతిరేక విధానాల కారణంగా నిరుద్యోగులు ప్రజలు వైసిపి ప్రభుత్వాన్ని వ్యతిరేకంగా బుద్ధి చెప్పారని ఆయన తెలిపారు. గత ప్రభుత్వంలో చేసిన తప్పులను మరోసారి నూతన ప్రభుత్వం చేయకుండా విద్యారంగ సమస్యలు ఎప్పటికప్పుడూ పరిష్కరించాలని నూతన జాతీయ విద్యా విధానాన్ని వ్యతిరేకించాలని అన్నారు. ఈ సమస్యలన్నింటినీ పై దృష్టి సారించి ముందుకు వెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వానికి కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు టి.నరేష్, మదన్ మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

రాజంపేట అర్బన్ : నూతనంగా ఏర్పాటు అవుతున్న ప్రభుత్వం విద్యా రంగానికి కృషి చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు దాంట్ల రమణ కోరారు. బుధవారం స్థానిక డిగ్రీ కలాశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నూతన ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీ నుంచి పాఠశాలలు పునఃప్రారంభం అవుతున్న సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో అసంపూర్ణంగా మధ్యలో ఆగిపోయిన భవనాలను పూర్తిచేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందరికి అందేలా చర్యలు తీసుకోవాలని, 2014 సంవత్సరంలో టిడిపి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఇంటర్మీడియట్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయడం జరిగిందని తెలిపారు. వైసిపి ప్రభుత్వం ఆ పథకాన్ని పూర్తిగా తీసివేసి పేద విద్యార్థుల పొట్ట కొట్టడం జరిగిందని, ఈ ప్రభుత్వం అయినా ఇంటర్మీడియట్ కళాశాల పాఠ్యపుస్తకాలు ఇచ్చి మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని తెలిపారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు, నాన్ టీచింగ్ పోస్టులు త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులను అన్ని విధాలుగా ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ కమిటీ సభ్యులు యుగందర్, కార్తీక్ నరేష్ పాల్గొన్నారు.

కూటమి విజయం చారిత్రాత్మకం : 'చమర్తి'

సమావేశంలో మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రాజు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

టిడిపి, జనసేన, బిజెపి కూటమి విజయం చారిత్రాత్మకమని టిడిపి రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్మోహన్‌రాజు అన్నారు. బుధవారం రాజంపేట టిడిపి పార్లమెంటు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాడు కాంగ్రెస్ అధినేత్రి ఇందిరాగాంధీ అహంకారానికి ఆంధ్రుల ఆత్మగౌరవం అనే నినాదంతో స్వర్గీయ నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీని రాష్ట్రంలో ఎలాగైతే చారిత్రాత్మక విజయాన్ని అందించారో అదే బాటలో నేడు జగన్మోహన్‌రెడ్డి అహంకారపూరిత, నియంత పాలనకు చరమగీతం పాడుతూ నారా చంద్రబాబునాయుడు సారథ్యంలో ఎన్‌డిఎ కూటమి చారిత్రాత్మక విజయాన్ని అందుతుందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అహంకార పూరిత రాజకీయాలు మనుగడ సాగించలేవన్నారు. ఇందుకు నిదర్శనమే ఈ ఎన్నికల ఫలితాలని తెలిపారు. జగన్మోహన్‌రెడ్డి నిరంకుశ వాదం వలన అదుపుతప్పిన రాష్ట్ర పాలనను గాడిలో పెట్టి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తామని అన్నారు. తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబు చేపట్టిన యువగళం పాదయాత్ర ప్రభావం ఈ ఎన్నికలలో ప్రధాన పాత్ర పోషించిందని తెలిపారు. తెలుగుదేశం పార్టీ పేరు చెబితే దాడులు, దౌర్జన్యాలు, అక్రమ అరెస్టులుకు పాల్పడుతున్న తరుణంలో మొక్కవోని ధైర్యంతో పార్టీకి అండగా నిలబడిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. చంద్రబాబు అక్రమ అరెస్టు సమయంలో తెలుగుదేశం పార్టీకి, బాబుకు, లోకేష్‌కు అండగా నిలబడి ఎన్‌డిఎ కూటమి ఏర్పాటులో ప్రధాన పాత్ర పోషించి కూటమి అఖండ మెజారిటీకి పాటుపడిన జనసేనాని పవన్ కల్యాణ్‌కు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. ఎన్‌డిఎ కూటమిలో చంద్రబాబు ప్రధాన పాత్ర పోషించబోతున్నారని, తద్వారా కేంద్ర ప్రభుత్వం సహకారంతో రాష్ట్రానికి మరిన్ని నిధులు సమకూర్చి రాజధాని ఏర్పాటుతోపాటు రాష్ట్ర సమగ్రాభివృద్ధికి చంద్రబాబు కృషి చేస్తారని తెలిపారు. రాజంపేట నియోజకవర్గంలో చోటు చేసుకున్న చిన్న చిన్న పొరబాట్లను సరిదిద్దుకొని వచ్చే ఎన్నికలకు నియోజకవర్గాన్ని బలోపేతం చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కూటమి విజయానికి కృషి చేసిన తెలుగుదేశం పార్టీ, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నీట్ ఫలితాల్లో సత్తా చాటిన రాయచోటి విద్యార్థి

ప్రజాశక్తి - రాయచోటి

రాయచోటి పట్టణంలోని బోస్ నగర్ వినాయక వీధికి చెందిన కొసినేపల్లి రెడ్డయ్య, చంద్రకళ దంపతుల కుమారుడైన కె.యోగానంద మంగళవారం విడుదలైన నీట్ ఫలితాల్లో 632 మార్కులు సాధించి ఆల్ ఇండియా స్థాయిలో 46 వేల ర్యాంకును సాధించారు. ఇతను ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు చిత్తూరు జిల్లా వలసపల్లి నవోదయ విద్యాలయంలో చదివాడు. ఇంటర్మీడియట్ విద్యను విజయవాడ నగరంలో ఓ ప్రయివేట్ కళాశాలలో శిక్షణ తీసుకుని మొదటి ప్రయత్నంలోనే ఫలితాన్ని సాధించినట్లు వివరించారు. డాక్టర్ కావడమే ధ్యేమని తెలిపారు. మంచి వైద్యుడిగా పేరు తెచ్చుకుని పేదలకు సేవ చేయడమే తన లక్ష్యమని వివరించారు. తన తల్లిదండ్రుల ఆశ నెరవేరుస్తానన్నారు. ఈ సందర్భంగా బంధుమిత్రులు, స్నేహితులు, శుభాకాంక్షలు తెలియజేశారు.

శ్రీనివాసరాజును సన్మానిస్తున్న నాయకులు

అభివృద్ధి, సంక్షేమమే కూటమి ఎజెండా : 'యల్లటూరు'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాష్ట్రంలో సంక్షేమంతో పాటు అభివృద్ధికి బాటలు వేయడమే ఎన్‌డిఎ కూటమి ఎజెండా అని జనసేన పార్టీ రాజంపేట పార్లమెంట్ సమన్వయకర్త యల్లటూరు శ్రీనివాసరాజు తెలిపారు. బుధవారం యల్లటూరు భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక ఓటు చీలకూడదన్న లక్ష్యంతో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ బిజెపి, టిడిపి, జనసేన కూటమికి కృషి చేశారని తెలిపారు. 21 సీట్లు పొంది ఎన్నికల్లోకి వెళ్ళారని, ఆ సమయంలో సొంత పార్టీ నేతలే అధినేతను విమర్శించినప్పటికీ రాష్ట్రాభివృద్ధి కోసం తలవంచి నేడు విజయవంతమయ్యారని పేర్కొన్నారు. కూటమి విజయంతో పాటు జనసేన వంద శాతం అన్ని స్థానాలలో అఖండ విజయం సాధించడం రాష్ట్ర చరిత్రలో ప్రప్రథమమని తెలిపారు. కూటమి విజయంతో రాక్షస పాలన నుంచి రాష్ట్రానికి విముక్తి లభించిందన్నారు. పార్లమెంట్ సమన్వయకర్తగా రైల్వేకోడూరు కేటాయించిన జనసేన స్థానాన్ని అత్యధిక మెజారిటీతో గెలిపించడంలో శక్తి వంచన లేకుండా కృషి చేశానని చెప్పారు. అనంతరం కేక్ కట్ చేసి విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. టిడిపి నాయకులు అబూబకర్‌తో పాటు మరి కొందరు ముఖ్య నేతలు ఎల్లటూరు శ్రీనివాసరాజును శాలువాతో ఘనంగా సన్మానం నుంచి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో మాజీ జడ్‌పిటిసి యల్లటూరు శివరామరాజు, సమ్మెట శివప్రసాద్, ఆకుల చలపతి, తిప్పాయపల్లె ప్రశాంత్, సలీం, మున్నా, ఖాజా, షబ్బీర్, తోట సురేష్ పాల్గొన్నారు.

ప్రజా శ్రేయస్సు కోసం పనిచేస్తాం : కాంగ్రెస్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

సార్వత్రిక ఎన్నికల్లో రాహుల్ గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ అనూహ్య ఫలితాలను రాబట్టిందని మదనపల్లె కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రెడ్డి సాహెబ్ స్పష్టం చేశారు. బుధవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2019తో పోల్చితే 2024లో కాంగ్రెస్‌కు ఘననీయమైన ఓటు బ్యాంకు పెరిగిందన్నారు. 52 సీట్ల నుంచి ఇండియా వేదిక 232 సీట్లకు చేరుకోవడం శుభ పరిణామన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలకు బాధ్యతగా ఉంటామని ప్రజా శ్రేయస్సు దృష్ట్యా రాజ్యాంగ రక్షణ కోసం రాహుల్ గాంధీ నేతృత్వంలో పనిచేస్తామని పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని కాపాడుతూ ప్రతిపక్ష పాత్రను సమర్థవంతంగా పోషిస్తామన్నారు. ఇటు ఆంధ్రప్రదేశ్‌లోనూ వైఎస్ షర్మిల నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ ఒక శాతం ఓటు బ్యాంకు నుంచి అమాంతం పెరిగిందన్నారు. ఏపిలో 200 ఉన్న ఎమ్మెల్యే, ఎంపీ స్థానాలకు 1500 మంది అప్లికేషన్లు పెట్టుకోవడం కాంగ్రెస్ పార్టీ ఉన్నతిని తెలియజేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతమైందని ప్రజలకు మంచి చేసే కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరిస్తున్న తీరుకు ధన్యవాదాలు తెలియజేశారు. మదనపల్లెలో గెలిచిన ఎమ్మెల్యే షాజహాన్ బాషాకు గతంలో ఇక్కడ ఐదేళ్లు పనిచేసిన అనుభవం ఉందని తెలిపారు. మదనపల్లె అభివృద్ధికి ఆయన పని చేయాలని కోరారు. మదనపల్లెను జిల్లాను చేయడంలో ముఖ్య భూమిక పోషించి గతంలో నారా లోకేష్, చంద్రబాబు నాయుడులు ఇచ్చిన హామీ మేరకు మదనపల్లెను జిల్లా చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని గుర్తు చేశారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మీనాకుమారి, ఎస్.కె రెడ్డి బాషా, మహమ్మద్ పీర్, ఈశ్వరమ్మ, సమీరుద్దీన్, శరత్ కుమార్‌రెడ్డి, నాగరాజు, అల్లాబకష్ పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడండి

మొక్కలు నాటుతున్న డైరెక్టర్ రామలింగారెడ్డి

ప్రజాశక్తి-మదనపల్లి

ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని కాపాడాలని శ్రీజ్ఞానాంబికా డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ రాటకొండ గురుప్రసాద్ అన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా మొక్కలు నాటా లన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ పరిరక్షణకు సంబంధించి అవగాహనను పెంపొం దించడానికి ప్రతి సంవత్సరం జూన్ 5వ తేదీ జరుపుకునే కార్యక్రమమని పేర్కొన్నారు. వాతావరణంలో మార్పు ప్రజా జీవితాలను, ఆరోగ్యాన్ని వివిధ మార్గాల్లో ప్రభావితం చేయనుందని చెప్పారు. అనంతరం ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మొక్కలు నాటారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రమాదేవి, ఎన్ఎస్ఎస్ పిఒలు రెడ్డెప్ప, మునేంద్ర నాయక్ విద్యార్థులు పాల్గొన్నారు. **'ఆదిత్య'లో...:** ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు నిర్వహించినట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ రామలింగారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాలలో మొక్కల నాటామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ కె.సతీష్ బాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వై.అరుణ్ కుమార్‌రెడ్డి, విభాగ్యపత్తులు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** మిట్స్‌లో పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రామనాథన్ మాట్లాడుతూ గాలి, నీరు, నింగి, నిప్పు, నేల అనే పంచభూతాల వల్లే మానవ మనుగడ సాధ్యమవుతుందని తెలిపారు. భూమిపై అన్ని వనరులూ సక్రమంగా ఉంటేనే మానవ అభివృద్ధి నిజమవుతుందన్నారు. కళాశాల ప్రాంగణంలో అధ్యాపకులు, విద్యార్థులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ ప్రదీప్ కుమార్, సివిల్ విభాగాధిపతి డాక్టర్ దీపాంకర్ రాయ్ పాల్గొన్నారు.

ప్రజా తీర్పును గౌరవిస్తా : 'గడికోట'

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ఎన్నికలలో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తానని వైసిపి అన్నమయ్య జిల్లా అధ్యక్షులు గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఊపిరి ఉన్నంత వరకు ప్రజా సేవే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. 15 ఏళ్లుగా నియోజక వర్గ ప్రజలు తనను చాలా గొప్పగా ఆదరించారన్నారు. ఐదేళ్లు మాత్రమే అధికారంలో ఉన్నామని ,అందులో రెండేళ్లు కరోనా పరిస్థితులు నెలకొన్నాయన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో నియోజక వర్గంలో ప్రతి ఇంటినీ సందర్శించానని, కరోనా పరిస్థితుల్లోనూ ప్రజలకు తోడుగా ఉన్నానని చెప్పారు. మూడేళ్ళలో తన ద్వారా చేయగలిగిన అభివృద్ధిని చేశానని తెలిపారు. ఈ ఎన్నికలలో దాదాపుగా 90 వేలకు పైగా ఓట్లు వేసిన ప్రజలకు, నాయకులకు, కార్యకర్తలు, ప్రతి ఒక్కరికీ హృదయ పూర్వక కృతజ్ఞతలుతెలియజేస్తున్నానన్నారు. స్వల్ప ఓట్లతో ఓటమి చెందానన్నారు. హంగూ ఆర్భాటాలకు ప్రాధాన్యత లేకుండా, ప్రతి నిమిషమూ ఈ ప్రాంత అభివృద్ధి, ప్రజల శ్రేయస్సే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. ప్రజలకు సేవా కార్యక్రమాలు కానీ, ప్రజలకు కష్టం వచ్చిన సమయాలలో తోడుగా నిలుస్తానన్నారు. కొంతమంది అభిమానులు నిరుత్సాహపడి బాధపడుతున్న విషయాన్ని తాను అర్థం చేసుకోగలగనన్నారు. కానీ మనోధైర్యంతో కూడకట్టుకుని మనలను నమ్ముకున్న వారికి తోడుగా మనమందరమూ ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రజా స్వామ్యంలో ఎప్పుడూ ప్రజా తీర్పును గౌరవించాలని, ప్రజా నిర్ణయాన్ని గౌరవిస్తానని, ఎల్లప్పుడూ ప్రజలకు దగ్గరగా ఉంటానని ఆయన చెప్పారు. పదిహేనళ్లలో ప్రజలు అత్యధిక మెజారిటీతో గెలిపించినప్పుడూ పొంగిపోలేదు, ఇప్పుడు స్వల్ప మెజారిటీతో ఓడినా కృంగిపోనని చెప్పారు. ప్రజా సేవే లక్ష్యంగా, నియోజక వర్గ అభివృద్దే ధ్యేయంగా ముందుకు సాగుతానని శ్రీకాంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి

శిశు సంరక్షణ తల్లి బాధ్యత

ప్రజాశక్తి-కలకడ

బాల్యం ఆరోగ్యంగా గడపాలంటే బిడ్డ అనారోగ్య లక్షణాలు వెంటనే గుర్తించే నైపుణ్యం ప్రతి తల్లికి ఎంతో అవసరమని ఎర్రకోటపల్లి పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ కిషోర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పిహెచ్‌సి పరిధిలోని కదిరాయచెరువు గ్రామంలో 104 వైద్య సేవలు అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శిశువుకు అనారోగ్యం లక్షణాలపై తల్లి తరచూ ప్రత్యేక నిఘా ఉంచాలని, ప్రస్తుత పరిస్థితుల్లో జ్వరం, జలుబు, నీరసం, శ్వాసతీసుకోవడం కష్టం, వాంతి చేసుకోవడం, అసాధారణ విరేచనాలు, తల్లిపాలు, అదనపు ఆహారం తీసుకోవాలనే ధ్యాస లేకపోవడం, శరీరంపై ర్యాష్, మొదలగు అసాధారణమైన లక్షణాలు గమనిస్తూ ఉండాలని, ఏదైనా చిన్నపాటి అనారోగ్య లక్షణాలు ఉన్నప్పుడు దగ్గరలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచిత చికిత్స, సూచనలు, సలహాలు పొందాలని అన్నారు. ఈ అంశంలో సమీప ఆశా కార్యకర్తల సహకారం తీసుకోవాలని, అర్ధగంటలోపు ముర్రుపాలు పట్టడం ఆరు నెలలు వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వడం, ఆరు నెలల తర్వాత తల్లిపాలతోపాటు అదనపు ఆహారం ఇవ్వడం, బిడ్డకు తల్లిపాలు, ఆహారం ఇచ్చే ముందు చేతులను ఆరు పద్ధతుల్లో ఇరవై నిమిషా చేతుల శుభ్రత తప్పగా పాటించాలని సూచించారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా బిడ్డని శరీరాన్ని పూర్తిగా బట్టలతో కప్పివుంచడం, చలిగాలి సోకకుం డా ఉన్ని బట్టలను ధరించడం, నిర్దేశించిన సమయంలో ఒక్కో టీకాకు నెల వ్యవధిలో పూర్తి టీకాలు ఇప్పించడం మొదలగు అంశాలపై తల్లులకు అవగాహన కలిగి ఉండాలని అన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికార్రి జయరామయ్య, సుబ్బరత్న, పిహెచ్ఎన్ఎల్, హెచ్‌సిఎ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

దేశంలో సత్తాచాటిన కాంగ్రెస్

ప్రజాశక్తి-గుర్రంకొండ

సార్వత్రిక ఎన్నికల్లో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ అనూహ్య విజయాలు సాధించిందని సత్తా చాటిందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సమిరుద్దీన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ ప్రజలు ఓటు ద్వారా పార్టీపై పెట్టుకున్న నమ్మకాన్ని చాటుతూ బిజెపికి ఘాటైన సమాధానాన్ని ఇచ్చారని ప్రజలు కులమతాలకు అతీతంగా ప్రగతిని ఆశిస్తూ భారతదేశంలో అసమానతలు, వివక్షలకు తావు లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలిస్తుందన్న నమ్మకంతో ఉన్నారని అన్నారు. కేరళలోని వాయనాడు, యుపిలోని రాయిబరేలిలో రాహుల్‌గాంధీ విజయం సాధించడం సంతోషకరమన్నారు.

మొదటి రౌండ్ నుంచి అరవ శ్రీధర్‌దే ఆధిపత్యం

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

అరవ శ్రీధర్

సార్వత్రిక ఎన్నికల ఫలితాలలో రైల్వేకోడూరు నియోజకవర్గం కూటమి జనసేన అభ్యర్థి అరవ శ్రీధర్ 14 రౌండ్లలో మెజారిటీ సాధించారు. నియోజకవర్గంలోని ఐదు మండలాలలో 252 పోలింగ్ బూత్ లు ఉండగా 18 రౌండ్లు కౌంటింగ్ ప్రక్రియ సాగింది అందులో మొదటి రౌండులో శ్రీధర్‌కు 4189,ఓట్లు రాగా కొరముట్ల శ్రీనివాసులకు 2760 ఓట్లు వచ్చాయి అందులో 1429 శ్రీధర్ మెజారిటీ సాధించారు. రెండవ రౌండ్ లో శ్రీధర్ కు 4314 రాగా కొరముట్లకు 3869 వచ్చాయి. మూడో రౌండ్‌లో శ్రీధర్‌కు 5385, కొరముట్లకు 4028, నాలుగవ రౌండులో శ్రీధర్ కు 5495, కొరముట్లకు 4542,అయిదవ రౌండులో శ్రీధర్ కు 5894 కోరముట్లకు 3045, ఆరవ రౌండులో శ్రీధర్ కు 6132 కోరమెట్లకు 3823, ఏడవ రౌండ్లో శ్రీధర్ కు 5360 కోరమెట్లకు 3939, ఎనిమిదవ రౌండ్లో శ్రీధర్ కు 4000 కొరముట్లకు 3692, తొమ్మిదవ రౌండ్ లో శ్రీధర్ కు 3776 కొరముట్లకు 3323, పదవ రౌండ్ లో శ్రీధర్‌కు 4366,కొరముట్లకు 3356, 11వ రౌండ్ లో శ్రీధర్ కు 4648 కోరముట్లకు 3493, 12వ రౌండ్ లో శ్రీధర్ కు 4174, కొరముట్లకు 4063 12వ రౌండ్ ముగిసే సమయానికి శ్రీధర్‌కు 13,800 మెజారిటీ లభించింది. 13వ రౌండ్ లో శ్రీధర్ కు 3359 రాగా, కొరముట్లకు 3901, 14వ రౌండులో శ్రీధర్ కు 3501, కోరముట్లకు 3377, 15వ రౌండ్‌లో శ్రీధర్‌కు 3275, కోరముట్లకు 2736, 16వ రౌండ్ లో శ్రీధర్ కు 2770 కోరముట్లకు 4931, 17వ రౌండ్ లో శ్రీధర్‌కు 3574, కొరముట్లకు 3895,18వ రౌండ్ లో శ్రీధర్ కు 3489 కొరముట్లకు 4229, 18 రౌండ్లు ముగిసే సమయానికి ఆరవ శ్రీధర్ కు 10,699, ఓట్ల మెజారిటీ లభించింది. 18 రౌండ్లకు గాను కేవలం నాలుగు రౌండ్ల లోనే కొరముట్ల కొంతమేర ఆదిత్యం కనబరిచారు. పోస్టల్ బ్యాలెట్ లలో మొదటి రౌండులో శ్రీధర్ కు 531 రాగా కొరముట్లకు 313, రెండవ రౌండ్ లో శ్రీధర్ కు 362 కోరమెట్లకు 178, పోస్టల్ బ్యాలెట్ లతో కలిపి మొత్తం అరవ శ్రీధర్ కు 78 594 ఓట్లు రాగా, కొరముట్ల శ్రీనివాసులకు 67493 ఓట్లు వచ్చాయి 11,101 మెజారిటీతో జనసేన అభ్యర్థి అరవ శ్రీధర్ ఘన విజయం సాధించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

- ప్రిన్సిపల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక వైఎస్ఆర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ల పక్రియ ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చెరసాల యోగాం జనేయులు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డిగ్రీ కళా శాలకు ప్రభుత్వం నూతన కోర్సును మంజూరు చేసిందన్నారు. 5 కోర్సులకు అదనంగా మరో నూతన కోర్సు బిఎస్సీ హానర్స్ బాటనీ 2024-25 విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు అందుబాటులో ఉందన్నారు. ఇప్పటికే బిఎ, హానర్స్ హిస్టరీ, బీకాం హానర్స్ కంప్యూటర్ అప్లికేషన్స్, బిఎస్సీ హానర్స్ కంప్యూటర్ సైన్స్, మ్యాథ్స్, కెమిస్ట్రీ కోర్సులు ఉన్నట్లు చెప్పారు. కళాశాలలో 10 మంది పిహెచ్‌డి అధ్యాపకులతోపాటు 30ఏళ్ల అనుభవం బోధన సిబ్బంది ఉన్నారని తెలిపారు. కళాశాలలో ఎన్ఎస్ఎస్, స్పోర్ట్స్ అండ్ గేమ్స్, రెడ్ రిబ్బన్ క్లబ్, క్యాంపస్ డ్రైవ్‌తోపాటు ఆధునిక పద్ధతుల్లో బోధన నిర్వహిస్తున్నట్లు తెలి పారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో విద్యార్థులకు సంపూర్ణ రక్షణ ఉంటుం దన్నారు. తమ కళాశాల నుండి 150 మంది డిగ్రీ ఉత్తీర్ణులైన విద్యార్థులు కడప, బెంగళూరులోని ప్రముఖ కంపెనీలలో ఉద్యోగాలు చేస్తున్నట్లు తెలిపారు. ఇంటర్ పాస్ అయిన విద్యార్థులు కళాశాలలోని హెల్ప్ డెస్కను సంప్రదించి ఉచితంగా ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని వేంపల్లె మండలంతోపాటు ఆయా మండలాల్లో ఉన్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ కోరారు.

పిల్లల ఎదుగుదలకే మనోవికాసం

ప్రజాశక్తి-గాలివీడు

వేసవి సెలవులలో పిల్లల మనోవికాసాన్ని పెంపొందించుకోవడానికి ప్రతి ఏడాది గ్రంథాలయ శిక్షణ తరగతులు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని లైబ్రేరియన్ రామచంద్రనాయక్ పేర్కొన్నారు. మే 15 నుంచి ప్రారంభమైన వేసవి శిబిరం ఈనెల 10వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణలో విద్యార్థులకు క్రీడల్లో నైపుణ్యం పొందిన వారికి ఆటలు పోటీలు, క్విజ్ కాంపిటీషన్ నిర్వహించి విజేతలకు బహుమతులు అందిస్తామని చెప్పారు. బుధవారం శిక్షణ తరగతులను తనిఖీ చేసి పిల్లలతో ఆయన ముచ్చటించారు. శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పిల్లలతో మాట్లాడుతున్న లైబ్రేరియన్ రామచంద్రనాయక్

టిడిపి కూటమిది అద్భుత విజయం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

టిడిపి, జనసేన, బిజెపి కూటమి అద్భుత విజయం సాధించిందని టిడిపి రాజంపేట పార్లమెంటు అధ్యక్షులు చమర్తి జగన్మోహన్‌రాజు అన్నారు. బుధవారం రాజంపేట టిడిపి పార్లమెంటు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి అహంకారపూరిత, నియంత పాలనకు చరమగీతం పాడుతూ చంద్రబాబునాయుడు సారథ్యంలోని టిడిపి కూటమి చారిత్రాత్మక విజయాన్ని అందుతుందని తెలిపారు. ప్రజా స్వామ్య వ్యవస్థలో అహంకార పూరిత రాజకీయాలు మనుగడ సాగించలేవని అన్నారు. ఇందుకు నిదర్శనమే ఈ ఎన్నికల ఫలితాలని తెలిపారు. జగన్ నిరంకుశ వాదం వలన అదుపుతప్పిన రాష్ట్ర పాలనను గాడిలో పెట్టి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తామని అన్నారు. తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ప్రభావం ఈ ఎన్నికలలో ప్రధాన పాత్ర పోషించిందని తెలిపారు. టిడిపి పేరు చెబితే దాడులు, దౌర్జన్యాలు, అక్రమ అరెస్టులకు పాల్పడుతున్న తరుణంలో మొక్కవోని ధైర్యంతో పార్టీకి అండగా నిలబడిన టిడిపి కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. ఎన్‌డిఎ కూటమిలో చంద్రబాబు ప్రధాన పాత్ర పోషించబోతున్నారని, తద్వారా కేంద్ర ప్రభుత్వం సహకారంతో రాష్ట్రానికి మరిన్ని నిధులు సమకూర్చి రాజధాని ఏర్పాటు తోపాటు రాష్ట్ర సమగ్రాభివృద్ధికి చంద్రబాబు కృషి చేస్తారని తెలిపారు. రాజంపేట నియోజకవర్గంలో చోటు చేసుకున్న చిన్న చిన్న పొరబాట్లను సరిదిద్దుకొని వచ్చే ఎన్నికలకు నియోజకవర్గాన్ని బలోపేతం చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కూటమి విజయానికి కృషిచేసిన టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. **నిమ్మనపల్లి :** దేశ చరిత్రలో టిడిపి కూటమి సాధించిన విజయం చారిత్రాత్మకంగా నిలిచిపోతుందని రాజంపేట పార్లమెంటరీ టిడిపి అధికార ప్రతినిధి ఆర్.జె. వెంకటేష్ పేర్కొన్నారు. బుధవారం తన కార్యాలయంలో రామసముద్రం టిడిపి మండల అధ్యక్షులు విజయ్‌కుమార్ గౌడ్, అన్వర్‌బాషా, విజయమ్మ, భువనేశ్వర్‌రెడ్డి లతో కలిసి నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంగళవారం వెలువడిన సార్వత్రిక ఎన్నికల ఫలి తాలలో 175 స్థానాలకు గాను 164 ఎమ్మెల్యే స్థానాలు గెలిచిందని అన్నారు. గత ఐదేళ్లలో వైసిపి ప్రభు త్వంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ఆదాయం సృష్టించకుండా, సంక్షేమాల పేరుతో సంక్షోభాన్ని సృష్టిం చారని అన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరుతో పేదల భూములను కాజేయడానికి ప్రణాళికలను రచించారని, ప్రజలు మేలుకొని తగిన బుద్ధి చెప్పారని అన్నారు. వైసిపి ప్రభుత్వం హయాంలో రూ.12 లక్షల కోట్లతో అప్పుచేశారని అన్నారు. ప్రజలు టిడిపి కూటమికి విచక్షణతో ఓట్లు వేసి ఘన విజయాన్ని అందించి రాష్ట్ర భవిష్యత్తులో కాపాడుకున్నారని తెలిపారు. ఇంతటి ఘన విజయాన్ని ప్రజలకు అంకితం చేస్తున్నట్లు తెలిపారు.

నిమ్మనపల్లి: మాట్లాడుతున్న ఆర్‌జె.వెంకటేష్

ప్రజల రుణం తీర్చుకుంటా : 'మండిపల్లి'

ప్రజాశక్తి-రామాపురం

సార్వత్రిక ఎన్నికల్లో అద్భుత విజయాన్ని అందించిన ప్రజల రుణం తీర్చుకుంటానని రాయచోటి ఎమ్మెల్యే మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రమైన రామాపురంలో మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకానాథ్ రెడ్డిని ఆయన స్వగృహంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డిని చిత్తుచిత్తుగా ఓడించి చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఫలితాలు సాధించడం చాలా సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలో అరాచకాలు, అక్రమాలు మితిమీరిపోయి ఉంటే ప్రజలు చూస్తూ ఊరు కోరని దానికి వైసిపి భారీ ఓటమే నిదర్శనమని అన్నారు.సిఎంగా చంద్రబాబు రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తారని అన్నారు. అనంతరం చిట్లూరు గ్రామంలో రోడ్డు ప్రమాదంలో గాయపడి విశ్రాంతి తీసుకుంటున్న గాలివీటి సురేందర్ రెడ్డిని ఆయన పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్‌రెడ్డి, శివారెడ్డి, సరస్వతి పల్లి సర్పంచ్ మున్నీర్‌బాషా, రేఖ బ్రదర్స్, చంద్రశేఖర్ రెడ్డి, కదిరప్పనాయుడు, లోకేష్ పాల్గొన్నారు.

రాంప్రసాద్‌రెడ్డి, ద్వారకనాథ్‌రెడ్డిలను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

వైసిపి శ్రేణులను నిరాశపరిచిన ఎన్నికల ఫలితాలు

ప్రజాశక్తి-పీలేరు

తమ అభిమాన నాయకులు మంచి మెజార్టీతో ఎంపీ, ఎమ్మెల్యేగా గెలుపొందుతారని ఎదురుచూసిన పీలేరు నియోజకవర్గం వైసిపి శ్రేణులను ఎన్నికల ఫలితాలు నిరాశపరిచాయి. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో మంగళవారం ఓట్ల లెక్కింపు జరిగింది. రాజంపేట పార్లమెంటు నియోజకవర్గానికి బిజెపి తరపున ఎంపీ అభ్యర్థిగా పోటీచేసిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి, సిట్టింగ్ ఎంపీ, అభ్యర్థి పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డిల మధ్య గట్టి పోటీ నెలకొంది. ఇందులో నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి 4,64,607 ఓట్లు సాధించారు. పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి 5,35,537 ఓట్లతో 68,930 ఓట్ల మెజార్టీ పొందగారు. ఓటర్లు మిథున్ రెడ్డి వైపే మొగ్గు చూపి హ్యాట్రిక్ విజయాన్ని అందించినప్పటికీ, ఆశించిన మేరకు ఆయనకు మెజార్టీ దక్కలేదు. అలాగే పీలేరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వైఎస్ఆర్సిపి సిట్టింగ్ ఎమ్మెల్యే, అభ్యర్థి చింతల రామచంద్రా రెడ్డి, తెలుగుదేశం పార్టీ అభ్యర్థి నల్లారి కిషన్ కుమార్ రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి బాలిరెడ్డి సోమశేఖర్ రెడ్డితో పాటు మరో తొమ్మిది మంది అభ్యర్థులు పోటీ చేశారు. అయితే ఐదేళ్లపాటు జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన సంక్షేమ పథకాలు, పీలేరు నియోజకవర్గం పరిధిలో రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి సహకారంతో చేసిన అభివృద్ధి కార్యక్రమాలు వైకాపా ఎమ్మెల్యే అభ్యర్థి చింతల రామచంద్రారెడ్డితో పాటు ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డికి కూడా మంచి మెజార్టీతో కూడిన హ్యాట్రిక్ విజయాన్ని అందిస్తాయని ఆ పార్టీ శ్రేణులు ఆశించారు. కానీ, ఓటర్లు ఒకరికి మోదం, మరొకరికి ఖేదం మిగిల్చారు. పీలేరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన తెదేపా అభ్యర్థి నల్లారి కిషన్ కుమార్ రెడ్డి 1,03,136 ఓట్లు పోలై 25,081 ఓట్ల మెజార్టీ సాధించారు. వైసిపి సిట్టింగ్ ఎమ్మెల్యే, అభ్యర్థి అయిన చింతల రామచంద్రా రెడ్డికి 80,501 ఓట్లు దక్కాయి.వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కూడా హ్యాట్రిక్ విజయాన్ని సాధిస్తాడని భావించిన పార్టీ శ్రేణుల ఆశలపై నీళ్ల చల్లినట్లయింది. అలాగే పీలేరు అసెంబ్లీకి పోటీ చేసిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బాలిరెడ్డి సోమశేఖర్ రెడ్డికి 3,403 ఓట్లు, బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థి ఎంసి వెంకటరమణకు 498 ఓట్లు, అంబేద్కర్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జి. ఆంకలేశ్వరికి 232 ఓట్లు, జై మహాభారత్ పార్టీ అభ్యర్థి ఎం విజయకుమార్ కు 961 ఓట్లు, స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేసిన ఆసాది వెంకటాద్రికి 97 ఓట్లు, పి. రామకృష్ణారెడ్డికి 329 ఓట్లు, వి. మంజునాథ్ కు 125 ఓట్లు, కె. బ్రహ్మయ్య ఆచారికి 622 ఓట్లు, వై. మహేష్ రెడ్డికి 174 ఓట్లు, కె. చిన్నరెడ్డెప్ప రెడ్డికి 153 ఓట్లు, నోటాకు 1,869 ఓట్లు పోలయ్యాయి. మంచి మెజారిటీతో చింతల రామచంద్రారెడ్డి మూడోసారి ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ విజయం సాధిస్తారని ఆశించిన వైసిపి ఆశావహులకు ఆయన ఓటమి పాలవ్వడంతో చివరికి నిరాశే మిగిలింది.

పంట కాలువలోకి చేరుతున్న వ్యర్థ నీరు

కాలువలో నిలిచిన వ్యర్థ నీరు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని సిద్ధారెడ్డిపల్లి పంచాయతీలోని ద్వారకానగరం వద్ద పంట కాలువలోకి నీరు వచ్చి చేరుతోంది. గ్రామ సమీపంలోని పాలకేంద్రం నుంచి నీరు విడుదలవుతున్నట్లు ప్రజలు పేర్కొంటున్నారు. పాల కేంద్రంలో శుభ్రం చేసిన వ్యర్థ నీటిని బయటకు వదులుతూ ఉండడంతో అవి కాలువలోకి చేరి కెసి కెనాల్ కలుషితమవుతున్నాయి. గ్రామానికి మంచినీటి సరఫరా చేసే బోరు సమీపంలోకి ఈ నీరు వచ్చి చేరుతోంది. అంతేకాకుండా గ్రామంలోకి నీరు వచ్చే పైపులైను ఈ మార్గాన్నే అందుబాటులో ఉంది. దీంతో నీరు ఎక్కడ కలుషితం అవుతుందో అని ప్రజలు హడలిపోతున్నారు. అంతేకాకుండా వ్యర్థ నీటి వల్ల దుర్వాసన వస్తోంది. ఈ మార్గంలో ప్రయాణించే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మురుగునీరు పంట కాలువలోకి వదలకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఫ్యాక్టరీ నుంచి విడుదల చేసిన నీటిలో దుర్వాసన అధికంగా వస్తుండడంతో రోగాలు ప్రబలే అవకాశం ఉందని గ్రామస్తులు హడలిపోతున్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

అవినాష్‌కు చెక్ పెట్టి జైలుకు పంపిస్తాం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

రానున్న రోజుల్లో వైఎస్ అవినాష్‌రెడ్డికి చెక్ పెట్టి జైలుకు పంపించి భూపేష్‌రెడ్డిని ఎంపీగా గెలిపిస్తానని జమ్మలమడుగు ఎమ్మెల్యే చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఆయన మొదటిసారిగా బుధవారం జమ్మలమడుగు పట్టణానికి విచ్చేశారు. ఈ సందర్భంగా కార్యకర్తలు ఆదినారాయణరెడ్డి, భూపేష్ సుబ్బరామిరెడ్డికి పెద్ద ఎత్తున స్వాగతం పలికి అభినందనలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తన గెలుపునకు ప్రధాన కారణం టిడిపి, జనసేన అన్నారు. కార్యకర్తలు, నాయకులు, ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జగన్ చేసిన మోసాలను అసెంబ్లీలో నిలదీస్తానన్నారు. కడప జిల్లాలో వైఎస్ కుటుంబం హవా తగ్గిందన్నారు. వివేకానందరెడ్డి హత్య కేసులో అవినాష్‌రెడ్డినే కాకుండా అసలు జంట బయటకు వస్తుందని మరో సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగం కాకుండా భారతిరెడ్డి రాజ్యాంగం అమలైందన్నారు. జగన్మోహన్‌రెడ్డి ప్రతి రంగాన్ని దెబ్బ కొట్టారన్నారు. జగన్‌ను అసెంబ్లీలో నిలదీసి వైసిపిని తుంగలో తొక్కేస్తానన్నారు. కడప పార్లమెంటు టిడిపి అభ్యర్థి భూపేష్‌రెడ్డి ఓటమికి ప్రధాన కారణం షర్మిల అన్నారు. ఆమె పులివెందులలో ఓట్లు చీల్చలేకపోయిందన్నారు. నైతికంగా భూపేష్ సుబ్బరామిరెడ్డి గెలిచారని పేర్కొన్నారు. భూపేష్ సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో నైతిక విజయం మాదే అన్నారు. ఇది జిల్లా ప్రజల గెలుపు అన్నారు. కడపలో వారానికి నాలుగు రోజులు ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. స్థానిక సంస్థల్లో మెరుగైన ఫలితాల కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ శివనాథ్‌రెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి పాల్గొన్నారు

టిడిపి శ్రేణుల సంబరాలు

ప్రజాశక్తి - వేంపల్లె

సాధారణ ఎన్నికల్లో టిడిపి విజయ ఢంకా మోగించడంతో బుధవారం స్థానిక శ్రీచైతన్య వీధిలో ఆ పార్టీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. టిడిపి నాయకుడు మహమ్మద్ ఇనాయతుల్లా ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పార్టీ మండల కన్వీనర్ రామమునిరెడ్డిచే ప్రజలకు, అభిమానులకు, కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఆ ప్రాంత ప్రజలు రామమునిరెడ్డిని శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఊహించని రీతిలో టిడిపి అభ్యర్థులు ఎన్నికల్లో గెలుపొందారని తెలిపారు. టిడిపి పాలనలో ప్రజలకు మంచి రోజులు వస్తాయన్నారు. అర్హులైన వారందరికి ప్రభుత్వ పథ కాలను మంజూరవుతాయని తెలిపారు. పార్టీలకు అతీతంగా పథకాలు ఇవ్వ నున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వెంకట శివతోపాటు పలువురు టిడిపి నేతలు పాల్గొన్నారు. **చక్రాయపేట :** సాధారణ ఎన్నికల్లో టిడిపి విజయ ఢంకా మోగించడంతో గండి వీరాంజనేయ స్వామి దేవస్థానం ఆవరణలో ఆ పార్టీ నాయకులు బుధ వారం 10,116 టెంకా యలను కొట్టారు. టిడిపి యువనేత సింగారెడ్డి రజనీ కాంత్‌రెడ్డి (సూరి) ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సింగారెడ్డి రఘునాథరెడ్డి, సింగారెడ్డి నరసింహారెడ్డి, జనసేన పులివెందుల తాలూకా కన్వీనర్ డాక్టర్ హరీష్, గండి దేవస్థానం మాజీ చైర్మన్ వెంకటస్వామి, కావలి భాస్కర్, టిడిపి నాయకులు బాలస్వామిరెడ్డి, జగన్నాథరెడ్డి, మహమ్మద్ షబ్బీర్ ఆయా గ్రామాల టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ కోసం ఘర్షణ

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని నగరగుట్ట మంగళ కాలనీ సమీపంలో వాటర్ ప్లాంట్ కోసం టిడిపికి చెందినవారు ఘర్షణ పడ్డారు. నగరిగుట్టలో ఉన్న వాటర్ ప్లాంట్ తనకు కావాలంటే తనకు కావాలని నగరిగుట్ట తెలుగుదేశం పార్టీకి చెందిన వెంకటేష్, శ్రీను ఘర్షణ పడ్డారు. ఘర్షణలో ఇరువురికి గాయాలయ్యాయి. చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కిషోర్‌కుమార్‌రెడ్డికి అభినందనలు తెలుపుతున్న నాయకులు, కార్యకర్తలు

నగిరిపల్లిలో సందడి

ప్రజాశక్తి-కలికిరి

పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి సొంత గ్రామం నగిరి పల్లిలో ఆయన ఇంటి వద్ద టిడిపి నాయకులు, కార్యకర్తలు సందడి నెలకొంది. 25081 ఓట్ల మెజార్టీతో గెలవడంతో నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి అత్యధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు నగిరిపల్లికి చేరుకుని పుష్పగుచ్చాలు, శాలువలు కప్పి ఘనంగా అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో నియోజకవర్గంలోని ప్రజలు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించారని ఆనందం వ్యక్తం చేశారు. నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని ఎలాంటి కష్టం వచ్చినా వెంటనే వారిని ఆదుకుంటామని అన్నారు. నియోజకవర్గం మరింత అభివృద్ధి చేయడానికి నా వంతు కృషి చేస్తానని హామీనిచ్చారు.

రూపానందరెడ్డిని సన్మానిస్తున్న క్షత్రియ నాయకులు

'ముక్కా'ను కలిసిన క్షత్రియ నాయకులు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

నియోజకవర్గంలోని టిడిపి క్షత్రియ నాయకులు బుధవారం టిడిపి ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డిని, విజయం సాధించిన జనసేన అభ్యర్థి ఆరవ శ్రీధర్‌ను ముక్కానివాసంలో కలిశారు. క్షత్రియ నాయకులు సూరపరాజు సుబ్బరామరాజు, సంగరాజు రవికుమార్‌రాజు, జి.వెంకటేశ్వరరాజు, డి.కృష్ణంరాజు, జయచంద్రరాజు, ముద్దులూరు శివరామరాజు, ప్రభాకర్‌రాజు, జయరామరాజు తదితర క్షత్రియ నాయకులు కూటమి బలపరిచిన జనసేన పార్టీ అభ్యర్థి అరవ శ్రీధర్ విజయం సాధించడంతో టిడిపి ఇన్చార్జ్ ముక్క రూపానంద రెడ్డి కలసి పూల మాలలతో ఘనంగా సన్మానించారు. ఇది కూటమి సమిష్టి విజయమని నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్తకు తాను అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించి నియోజకవర్గం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు.

10 నుంచి పంచమ వేద మహాభారత యజ్ఞం

ప్రజాశక్తి-గాలివీడు

శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఈనెల 10 నుంచి 19వ తేదీ వరకు తృతీయ పంచమ వేద మహాభారత యజ్ఞాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పెద్దరాజా పేర్కొన్నారు. తిరుపతి గాన కోకిల జి.వరలక్ష్మి ఆధ్వర్యంలో హరికథ కాలక్షేపం, హార్మోనిస్ పార్థసారథి తబలా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ప్రతి ఏడాది మండలంలో మహా భారత యజ్ఞాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సోమవారం సర్పయాగం, మంగళవారం భీష్మ ప్రతిజ్ఞ, బుధవారం కర్ణ జననం, గురువారం గురుపాండవ జననం, శనివారం ద్రౌపతి కల్యాణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాగార్జున నాయుడు ఆధ్వర్యంలో సౌండ్ సిస్టంను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ అవకాశానికి స్థానిక ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'నల్లారి' గెలుపు హర్షణీయం

ప్రజాశక్తి-కలికిరి

పీలేరు నియోజకవర్గంలో టిడిపి నుంచి పోటీ చేసి కిషోర్‌కుమార్‌రెడ్డి గెలుపొందడం హర్షణీయమని టిడిపి యువనాయకుడు యోగేష్‌రెడ్డి పేర్కొన్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన తన తండ్రి సర్పంచ్ రెడ్డివారి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సమాధి వద్ద నివాళి అర్పించారు. సార్వత్రిక ఎన్నికలలో పీలేరు కిషోర్‌కుమార్‌రెడ్డి విజయం సాధించడంతో నాయకులు, కార్యకర్తలు, యువతతో భారీ ర్యాలీగా నిర్వహించారు. ఎన్నికల సమయంలో పార్టీ గెలుపునకు ప్రచారం చేస్తున్న సమ యంలో తన తండ్రి మరణించడం బాధకరమని అన్నారు. కిషోర్‌కుమార్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలిపించుకోవడం తన తండ్రి ఆశయమని అన్నారు. తన తండ్రి ఆశయ సాధన కోసం టిడిపి గెలుపునకు కృషి చేశానని తెలిపారు. మండల ప్రజలకు, టిడిపి నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటానని అన్నారు

నేటి నుంచి జనుముల పంపిణీ

ప్రజాశక్తి - దువ్వూరు

మండలంలో వరి పంట సాగు చేసే రైతులకు జనుము విత్తనాలను సబ్సిడీతో గురువారం నుంచి పంపిణీ చేస్తామని వ్యవసాయ అధికారి అమర్నాథ్‌రెడ్డి తెలిపారు. ఆయా పరిధిలో ఉండే రైతు భరోసా కేంద్రాల వద్దకు రైతులు తమ వెంట పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, సెల్ నెంబరు తప్పనిసరిగా తీసుకెళ్లాలన్నారు. జనుము విత్తన 10 కిలోలు రూ.880 కాగా 50శాతం సబ్సిడీ పోనూ రూ.440 రైతులు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

70 కుటుంబాలకు చికెన్ అందజేత

ప్రజాశక్తి - ముద్దనూరు

ఎన్‌డిఎ కూటమి గెలిచిన సందర్భంగా జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, నియోజకవర్గ టిడిపి నాయకులు భూపేష్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన టిడిపి నాయకులు చెర్లోపల్లి శ్రీకాంత్ బాబు, గరుడాచలం ఆది ఆధ్వర్యంలో బుధవారం స్థానిక కొత్తకొట్టాల వీధిలోని 70 కుటుంబాలకు కిలో చొప్పున చికెన్, అల్లం, కొత్తిమీర పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాబు, భాస్కర్, హేమంత్, హరి, రమేష్ పాల్గొన్నారు.

వ్యాపారులు రాజకీయాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరు కూరగాయల మార్కెట్ వ్యాపారులు ఇప్పటికైనా రాజకీయాలకు దూరంగా ఉంటూ తమ జీవనోపాధి కోసం ప్రయత్నించాలని జిల్లా టిడిపి కార్యనిర్వాహకు కార్యదర్శి యస్.పి.మహబూబ్ హుశేన్ బుధవారం ఓ ప్రకటనలో కోరారు. వ్యాపారం జీవనోపాధిగా ఉండాలే తప్ప, రాజకీయం కాకూడదన్నారు. ప్రొద్దుటూరు కూరగాయల మార్కెట్‌లోని చిన్నపెద్ద వ్యాపారులు కొన్నేళ్ల నుండి రాజకీయ నాయకుల మధ్యన చిక్కుకొని యాతన పడుతున్నారన్నారు. వ్యాపారస్తుల్లోనే కొంతమంది రాజకీయ ప్రాపకం కోసమో, స్వప్రయోజనాల కోసమో వేసిన తప్పటడుగుల వల్ల మార్కెట్ వ్యాపారులకు తీరని అన్యాయం జరిగిందని వాపోయారు. ఒకరో ఇద్దరో పెద్ద వ్యాపారస్తులు తప్ప మధ్య, చిన్న వ్యాపారులు ఆర్థికంగా, మానసికంగా కుంగిపోయారని తెలిపారు. సంఘాలని చెప్పి రాజకీయాలు చొప్పించి తమ మనుగడను ప్రశ్నార్థకం చేసుకోవద్దని ఆయన కోరారు.

సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

సార్వత్రిక ఎన్నికల్లో సహకరించిన పులివెందుల నియోజకవర్గ ప్రజలకు, తెలుగుదేశం పార్టీ నాయకులకు, కార్యకర్తలకు శ్రేయోభిలాషులకు ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు అని పులివెందుల టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బీటెక్ రవి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో తమ విజయానికి శక్తికి మించి కృషి చేసినా రాష్ట్రం, ఇతర నియోజకవర్గాల్లో వచ్చిన ఫలితాలు పులివెందులలో రాలేదన్నారు. ఈ విషయం చాలా బాధిస్తోందన్నారు. జగన్‌రెడ్డి పాలన పట్ల రాష్ట్రమంతటా వ్యతిరేక పవనాలు చూపించినా ఇక్కడ జగన్‌రెడ్డినే ఎన్నుకున్నారని తెలిపారు. పులివెందులలో టిడిపి జెండా ఎగురుతుందో ఆనాడే తనకు తృప్తి, సంతృప్తి అన్నారు. రాబోయే రోజుల్లో మీ అందరి సహకారంతో పులివెందుల ప్రజల్లో సైతం మార్పు తెస్తామన్నారు. పులివెందులలో కుడా టిడిపి జెండా ఎగురవేస్తాం అనే నమ్మకం మాకుందన్నారు. జగన్ రెడ్డి మెజారిటీని 30 వేలు తగ్గించిన మీ అందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నట్లు రవి పేర్కొన్నారు.